క్లుప్తంగా

డాక్టర్ పవన్‌కుమార్‌కు ఉత్తమ న్యూరాలజిస్ట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ పవన్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన న్యూరాలజిస్ట్ డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్ బెస్ట్ న్యూరాలజిస్ట్ అవార్డును అందుకున్నారు. వరల్డ్ వైడ్ ఎచీవర్స్ సంస్థ ఈనెల 19న ఢిల్లీలో హెల్త్ కేర్ లీడర్ సమ్మిట్ అండ్ అవార్డ్స్–2023 కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో సినీ హీరోయిన్ భాగ్యశ్రీ, ఎంపీ, నేషనల్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ చైర్మన్ డాక్టర్ కిరీట్ సోలంకి చేతుల మీదుగా డాక్టర్ పవన్‌కుమార్ అవార్డు అందుకున్నారు. గుంటూరు సాంబశివపేటలో 2015 నుంచి న్యూరాలజిస్ట్‌గా వైద్యసేవలందిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్ అవార్డు అందుకున్న సందర్భంగా గుంటూరుకు చెందిన పలువురు వైద్యులు, ఐఎంఏ నేతలు ఆదివారం ఆయనకు అభినందనలు తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

పాత గుంటూరు: లయన్స్ క్లబ్ సభ్యులు ప్రజలకు సేవలందించడంలో ముందుండాలని క్లబ్ మల్టీపుల్ ఈవేస్ట్ కలెక్షన్ డ్రైవ్ కోఆర్డినేటర్ కె.వి జయచంద్ అన్నారు. ఆదివారం రింగురోడ్డులోని జేకేసీ కళాశాల సమావేశ మందిరంలో లయన్స్ ఇంటర్నేషనల్ 316 హెచ్ క్లబ్ ప్రెసిడెంట్, కార్యదర్శి, కోశాధికారులకు ప్రతి ఇంటా కాలుష్యాన్ని నివారించడంలో లయన్స్ క్లబ్ చేపట్టిన ఈ వేస్ట్ కలెక్షన్ డ్రైవ్‌పై శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. క్లబ్ జిల్లా ఇన్‌చార్జ్ గవర్నర్ పి.గోపీచంద్ మాట్లాడుతూ వాతావరణాన్ని కాలుష్యం చేసే ఇళ్లలోని ప్లాస్టిక్ వ్యర్థ వస్తువులను సేకరించి ఇంటర్నేషనల్ క్లబ్‌కు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీనివాస్, పూర్వ గవర్నర్ గోవిందరాజు, పూర్వ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ డీవీఎస్ రాజు పాల్గొని ఈ వేస్ట్ సేకరణలో పట్టణ, గ్రామ స్థాయిలో చేపట్టాల్సిన విధి విధానాలను వివరించారు. అనంతరం లయన్స్ క్లబ్ సమాచార పుస్తకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కేబినెట్ సెక్రటరీ ఈదర వెంకటేశ్వర్లు, కోశాధికారి రామన శ్రీనివాసరావు, సుబ్బయ్య, నగేష్ పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పందన

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

నేటి నుంచి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ మహోత్సవాలు

పాత గుంటూరు: ఆర్ అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సోమవారం నుంచి 27వ తేదీ వరకు అమ్మవారి అగ్నిప్రవేశ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ దేవరశెట్టి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం 4 గంటలకు పంచామృతాభిషేకంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. సాయంత్రం వరకు విశేష పూజలు, 6 గంటల నుంచి అమ్మవారి గ్రామోత్సవం, 24న ఉదయం 10 గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన, 25న ఉదయం 10 గంటలకు సామూహిక లక్ష పుష్పార్చన, 26న ఉదయం 10 గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన, 27న ఉదయం 10 గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం కాలపరిమితి పెంపుపై హర్షం

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పునరుద్ధరిస్తూ ప్రభుత్వం జీఓ తీసుకురావడం అభినందనీయమని డీబీఎఫ్ అధ్యక్షుడు కొరివి వినయకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2013లో సబ్‌ప్లాన్ చట్టం పదేళ్ల కాలపరిమితితో అమలులోకి వచ్చింది. 2023తో గడువు ముగుస్తుండటంతో ప్రభుత్వం చట్టాన్ని పునరుద్ధరిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడంపై సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు చెప్పారు. దళిత, గిరిజనుల సామాజిక ఆర్థిక సాధికారితకు ఎంతగానో ఉపయోగపడే ఈ చట్టానికి కాలపరిమితి లేకుండా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎస్సీ, ఎస్టీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఉద్దేశించిన సబ్ ప్లాన్ చట్టాన్ని మరో 10 సంవత్సరాలు పొడిగిస్తూ జీఓ నంబర్ 7ను ప్రభుత్వం విడుదల చేసినందుకుగాను సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు చెప్పారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌కు రోడ్డు ఏర్పాటు చేయండి

మేయర్ కావటి మనోహర్‌నాయుడు



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నందివెలుగు రోడ్డు బస్టాండ్ వెనుక వైపు నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రహరీ తొలగించి రోడ్డు ఏర్పాటు చేయాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ఆదేశించారు. గుంటూరు నగరంలో నందివెలుగు రోడ్డులో బస్టాండ్ వెనుక వైపు నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి రోడ్డు లేకుండా కొందరు షాపులు నిర్మిస్తున్న నేపథ్యంలో సదరు ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం రాష్ట్రంలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారన్నారు. షాపులు నిర్మించుకొనే వారు వారికి కేటాయించిన స్థలంలోనే షాపులను నిర్మించుకోవాలని సూచించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వద్దకు వివిధ కారణాలతో వచ్చే రోగులకు, డాక్టర్లకు, అంబులెన్సులు ప్రవేశానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అన్ని రకాలైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయుట జరుగుతుందన్నారు. ఈ అర్బన్ హెల్త్ సెంటర్ కు సమీపంలోని 3 వార్డుల ప్రజలు సుమారు 40 వేల మంది వరకు ప్రజలు ఉంటారని, ముఖ్యంగా వారిలో ఎక్కువగా పేద మధ్య తరగతి ప్రజలే నివసిస్తుంటారని, కావున ఆ ప్రజలే ఎక్కువగా ఈ హెల్త్ సెంటర్‌కు వస్తుంటారని వారికి ఎటువంటి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత నగర పాలక సంస్థపై ఉందని చెప్పారు. భవిష్యత్‌లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉందని, అందుకు తగినట్లుగా అధికారులు ప్రణాళికబద్ధంగా కార్యాచరణ సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, కార్పొరేటర్లు యర్రి ధనలక్ష్మి, షేక్ మహమూద్, పోలవరపు జ్యోతి పాల్గొన్నారు.

హేతువాద ఉద్యమ నేత రావిపూడికి నివాళి



వెంకటాద్రి చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: బహుముఖ ప్రజ్ఞాశాలి హేతువాద ఉద్యమనేత రావిపూడి వెంకటాద్రి మృతి హేతువాద ఉద్యమానికి తీరని లోటని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో రావిపూడి వెంకటాద్రి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిపురనేని రామస్వామి, ఎంఎన్ రాయ్ రచనలతో ప్రభావితుడై ప్రముఖ సంఘ సంస్కర్తలు పెరియార్ అన్నాదురైల సహచర్యంతో హేతువాద ఉద్యమాన్ని నిర్మించినట్లు చెప్పారు. పలు అంశాలపై లోతైన అధ్యయనం చేసి సుమారు 100 పుస్తకాలు రాశారని 102వ సంవత్సంలోకి అడుగు పెట్టి కూడా హేతువాది పత్రికకు వ్యాసాలు రాస్తూనే ఉన్నారని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, తెలుగు పండితులు రాజన్న మాస్టర్, యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ పాల్గొని నివాళులర్పించారు.

చెవి, ముక్కు గొంతు సమస్యలపై నిర్లక్ష్యం తగదు

లక్ష్మీపురం: వృద్ధాప్యంలో చెవి, ముక్కు, గొంతు సమస్యలు అధికమవుతూ ఉంటాయని వాటిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని ప్రముఖ ఈఎన్‌టీ డాక్టర్ బయ్యా శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, టి.నారపరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు.

ఆకట్టుకున్న అగ్ని సంస్కారం



పాత గుంటూరు: బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ శతజయంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సభకు సంస్థ కార్యదర్శి కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పూర్వ శాసన సభాపతి కె.ప్రతిభా భారతిని ఎన్టీఆర్ శతజయంతి పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వంగివరపు శారద, డాక్టర్ నాగశ్రీ, పర్వతనేని హరిత, రామరాజు లక్ష్మీ శ్రీనివాస్, డాక్టర్ కె.సీతాదేవి, ఆలయ అధ్యక్షుడు సిహెచ్. మస్తానయ్య, కావూరి సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం అభినయ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన అగ్ని సంస్కారం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఎ. రాహుల్ రచనకు వై.భవాని దర్శకత్వం వహించారు.

జర్నలిస్టులకు ఉచిత వైద్యశిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ రేవూరి హరికృష్ణ

గుంటూరు మెడికల్: ధృతి హాస్పిటల్స్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) గుంటూరు నగర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ధృతి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రేవూరి హరికృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక కొత్తపేట గౌరీశంకర్ థియేటర్ రోడ్డులోని ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉచిత వైద్యశిబిరంలో బ్లడ్ షుగర్, హిమోగ్లోబిన్, లిపిడ్ ప్రొఫైల్, కిడ్నీ, లివర్ ఫంక్షన్, థైరాయిడ్, చెస్ట్ ఎక్సరే, ఈసీజీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్, 2డీ ఎకో టెస్ట్, దంత వైద్య పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. సుమారు రూ.10వేల రూపాయల విలువ చేసే వైద్య పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. పేర్లను ముందస్తుగా 9858190190 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తమ పేర్లు నమోదు చేసుకున్నవారికి మాత్రమే వైద్యశిబిరంలో ఉచితంగా పరీక్షలు చేసి వైద్యసేవలను అందిస్తారని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో జర్నలిస్ట్ యూనియన్ నగర అధ్యక్షుడు వజ్రె కిరణ్‌కుమార్, సెక్రటరీ కందా ఫణీంద్రకుమార్, కోశాధికారి పఠాన్ ఆసిఫ్‌ఖాన్, ఐజేయూ సభ్యుడు గిరిధర్, జిల్లా సభ్యుడు షేక్ కరీం పాల్గొన్నారు.

స్కోప్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

నెహ్రూనగర్: పేద పిల్లలకు అవసరమైన పుస్తకాలు, దుస్తులు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న స్కోప్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు) తెలిపారు. ఆదివారం స్కోప్ డైరెక్టర్ డాక్టర్ దేవరపల్లి కొండలరావును డెప్యూటీ మేయర్ ఆయన కార్యాలయంలో అభినందించారు.

బీసీలకు సముచిత స్థానం

- జీసీలు వెనుకబడిన వర్గాలు కాదు.. వెన్నెముక లాంటి వర్గాలు
- బీసీ కార్పొరేషన్‌లు, చైర్మన్‌లు, డైరెక్టర్‌లను నియమించిన ఘనత సీఎం జగన్‌దే
- కృష్ణబలిజ పూసల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

పెదకాకాని: బీసీలను రాజకీయంగా చైతన్యవంతుల్ని చేయడంతో పాటు సముచిత స్థానం కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర కృష్ణ బలిజ పూసల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని పదవీ కాలాన్ని మరోసారి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం పెదకాకానిలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి చైర్మన్‌లను, డైరెక్టర్‌లను నియమించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన అతి తక్కువ కాలంలోనే నవరత్నాల పథకాల ద్వారా బీసీల్లో ఉన్న 139 ఉప కులాలకు డిబిట్, నాన్ డిబిట్ పద్ధతి ద్వారా లక్షా 75 వేల కోట్ల రూపాయలు నేరుగా అర్హుల బ్యాంకు ఖాతాలకే జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని మణికంఠ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలు రుణపడి ఉంటారన్నారు. రాష్ట్రంలో బీసీ అందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటారన్నారు. రానున్న ఎన్నికల్లో 175 సీట్లకు 175 సీట్లు సాధించే లక్ష్యంలో భాగస్వాములవుతారని పేర్కొన్నారు. ముందుగా రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణ బలిజ పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోలా అశోక్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు వుయ్యూరు సతీష్‌రెడ్డి, షేక్ నజీర్, తాడిబోయిన వేణు, పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులలో ముగిసిన హక్‌థాన్-2023

మొదటి బహుమతి విజ్ఞాన్ యూనివర్సిటీ కైవసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు టెక్నాలజీని అప్‌డేట్ చేసుకోవడం ద్వారా విజయాలు సాధించవచ్చని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. రెండు రోజులుగా పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ కళాశాలలో జరుగుతున్న హక్‌థాన్ ముగింపు వేడుకల్లో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో టెక్నాలజీకి అధిక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఆధునిక సైన్స్‌ను ఉపయోగించి టెక్నాలజీపై పట్టు సాధించాలని చెప్పారు. ఆధునిక అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కోడింగ్ పోటీలో మొత్తం 60 జట్లు పాల్గొనగా మొదటి బహుమతిని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, ద్వితీయ బహుమతిని వీవీఐటీ కళాశాల కైవసం చేసుకున్నాయన్నారు. విజేతలకు చెక్కులు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మరమనిషి టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మోహన్, పర్సల్ టెక్నాలజీస్ సీఈవో ఖాదర్, ఏపీ రేరా సభ్యులు చందు సాంబశివరావు, వివిధ కళాశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొలిపేందుకు నాటికలు దోహదం

కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలి: డాక్టర్ రాఘవశర్మ



చీకటి పువ్వు నాటికలోని సన్నివేశం

పెదకాకాని: సమాజాన్ని మేల్కొలిపేందుకు నాటిక ప్రదర్శనలు దోహదపడతాయని లలితా సూపర్ స్పెషాలిటీ నిర్వాహకుడు డాక్టర్ రాఘవశర్మ అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామంలో డాక్టర్ కాసరనేని సదాశివరావు నాటక కళా పరిషత్ 12వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి లలిత కళానికేతన్ వ్యవస్థాపకుడు మోపర్తి కాళిదాసు అధ్యక్షత వహించారు. డాక్టర్ కాసరనేని సదాశివరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన ప్రదర్శనల్లో భాగంగా తొలి రోజు సాయంత్రం 7:15 గంటలకు డాక్టర్ రాఘవశర్మ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ కాసరనేని సదాశివరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రాత్రి 7:30 గంటలకు తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన చైతన్య కళా భారతి వారి చీకటి పువ్వు నాటికను ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో లలితా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ రాఘవశర్మ మాట్లాడుతూ భారతీయ సంస్కృతులు, కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. వైద్య రంగంలో డాక్టర్ కాసరనేని సదాశివరావు అందించిన సేవలను కొనియాడారు. జాతీయ స్థాయిలో నాటకోత్సవాలు నిర్వహిస్తున్న లలిత కళానికేతన్ కార్యవర్గానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. రాత్రి 9 గంటలకు మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్ వారి అందిన ఆకాశం నాటిక, 10:30 గంటలకు కళాలయ కొలకలూరి వారి అగ్నిగర్భ నాటికలు సమాజంలో నిత్యం జరిగే మోసాలు, నిత్య సత్యాలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. సోమవారం గంగోత్రి పెదకాకాని వారి పేగు రాసిన శాసనం, 9 గంటలకు శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి గమ్యస్థానాల వైపు నాటిక, రాత్రి 10:30 గంటలకు ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి యాది నాటిక ప్రదర్శింపబడతాయని లలిత కళానికేతన్ వ్యవస్థాపకుడు మోపర్తి కాళిదాసు తెలిపారు.

ఆటో మాన్యుఫ్యాక్చరింగ్‌పై వర్క్‌షాప్

గుంటూరు రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని విజయాలు సాధించే దిశగా కృషి చేయాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఆటోమోషిన్ ఇన్ మాన్యుఫ్యాక్చరింగ్ టుమారో అండ్ బియాండ్ అనే వర్క్‌షాపు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా సాంకేతిక యంత్రాల తయారీ, వాటి ప్రాముఖ్యతలను వివరించారు. విద్యార్థులు కోర్స్ ముగిసే సమయానికి చేసే ఇంటర్న్‌షిప్‌లో నిష్ణాతులతో ఏర్పడే పరిచయం ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందుకోవడానికి మార్గంగా ఉండాలన్నారు. కళాశాలలో విద్యను అభ్యసించి నేడు కళాశాలకు అతిథిగా వచ్చిన కాంస్కోపో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రిన్సిపల్ సాఫ్ట్‌వేర్ టెస్ట్ ఇంజినీర్ చైతన్య పూళ్లపల్లిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ స్వర్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజస్వామి తిరువీధి ఉత్సవం



తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: త్యాగరాజస్వామి తిరువీధి ఉత్సవం భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. లక్ష్మీపురంలోని త్యాగరాజస్వామి కళావేదికగా గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సంగీత జగద్గురు త్యాగబ్రహ్మ ఆరాధనా సంగీత మహోత్సవాల్లో భాగంగా విజయవాడ లక్ష్మీకాంత్ బృందం నాదస్వరంతో ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుదిమెళ్ల కూర్మనాథస్వామి త్యాగరాజస్వామి వేషధారణలో పాల్గొన్నారు. త్యాగరాజస్వామి కీర్తనలలో అత్యంత విశేషమైన పంచరత్నకృతుల గోష్టిగానం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన వైజర్సు ప్రణతి గాత్ర కచేరి అలరించింది. రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమీ పాలకమండలి సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ ఆరాధనోత్సవాల విశిష్టతను వివరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. విజయవాడ సింధురాజేశ్వరి గాత్ర కచేరి, ప్రధాన కచేరిలో చెన్నైకు చెందిన విఘ్నేష్ ఈశ్వర్ గాత్రకచేరీలో త్యాగరాజకీర్తనలను ఆలపించారు. కళాకారులను సత్కరించిన అనంతరం ఆంజనేయ ఉత్సవంతో ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమాలను సంస్థ ప్రధాన కార్యదర్శి శేషురాణి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, ఉపాధ్యక్షురాలు మాధవపెద్ది మీనాక్షి, డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, లలితాదేవి పర్యవేక్షించారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డు 7వ లైనులోని శ్రీ సీతారామస్వామి మందిర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మందిర విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం వేద పారాయణం, యంత్ర పునఃశ్చరణ, ప్రాతరోపాసన హోమం, ఏకాశీతి కలశ స్థాపన, పంచవింశతి కలశ స్థాపన, నవకలశ స్థాపన, తీర్థప్రసాద గోష్టి, సాయంత్రం ధాన్యాదివాసం, పుష్పాదివాసం, శయ్యాదివాసం, బింబాదివాసం, యాగశాల ప్రదక్షిణలు, తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. మందిర సొసైటీ కార్యదర్శి కల్లి సుందరరామిరెడ్డి, కోశాధికారి బి. వెంకటేశ్వరరావు, సభ్యులు కల్లి శ్రీనివాసరెడ్డి, కోనూరు శ్రీనివాసరావు, కందిమళ్ల ఆంజనేయులు, బత్తినేని భావనకృష్ణ, హరికృష్ణ పర్యవేక్షించారు.

ఐడియల్ టీచర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఉర్దూ డీఐ ఖాసిం, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసిం పాతబస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐడియల్ ఉపాధ్యాయులు ఆదర్శవంతంగా పని చేస్తున్నారని, అదే విధంగా పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ నజీర్, సాలార్‌బేగ్, ఉపాధ్యాయులు జబీవుల్లా, అబ్దుల్ ఖయ్యూం పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభావితం చేయగలిగే శక్తి గురువులదే

సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత



మాట్లాడుతున్న సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో అంతర్గత శక్తులను ప్రభావితం చేయగలిగే మహత్తర శక్తి గురువులదేనని సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత పేర్కొన్నారు. ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఆదివారం 'విద్యార్థులు వారి భవిత– దశ దిశ, తల్లిదండ్రుల బాధ్యత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ సరిత మాట్లాడుతూ సృష్టిని నడిపిస్తున్న శక్తి గల భగవంతుడు మాదిరిగా గురువుకు విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దే శక్తి ఉందని అన్నారు. రేపటి దేశ భవిష్యత్తు మార్చగలిగే శక్తి ఉన్న పౌరులుగా విద్యార్థులను తయారు చేయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాత్ర ఎంతో కీలకమన్నారు. తినడానికి తిండి లేని పరిస్థితుల నుంచి దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవిని అధిష్టించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం తన గురువు వేసిన పునాది వలనే దేశ ప్రగతికి దిశ, దశ చూపారని అన్నారు. విద్యార్థులందరు దేశానికి విత్తనం వంటి వారని, దేశంలో 40 శాతం జనాభా విద్యార్థులేనని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు, డైరెక్టర్ మేకల శేషకుమారి, ప్రిన్సిపాల్ కల్యాణి, హెచ్‌ఎం మీనాక్షి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం అభివృద్ధికి సీఎం కృషి

- రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి
- సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ పాలన
- గుంటూరు, కృష్ణా జిల్లాల కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్
- సంక్షేమ పథకాల అమలులో ఏపీ దేశంలో అగ్రగామి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, నియోజకవర్గం పరిశీలకుడు భవకుమార్
- ముగిసిన ప్రత్తిపాడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, వేదికపై మాజీ మంత్రి మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఎంహెచ్‌ఆర్ కల్యాణ మండపంలో ప్రత్తిపాడు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు, కృష్ణా జిల్లాల వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి మేకతోటి సుచరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని గుర్తుచేశారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో కేవలం తమ వర్గానికి, తమ పార్టీవారికి మాత్రమే సంక్షేమ పథకాలు అమలు చేసేవారని, నేడు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం ఇంటి ముందుకే అందుతోందని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. నవరత్నాల పథకాలతో రాష్ట్రంలోని ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసిన తరువాత ప్రజలు తమ సమస్యల కోసం మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పనిలేకుండా గ్రామంలోనే సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. నియోజకవర్గం పరిశీలకుడు బొప్పన భవకుమార్ మాట్లాడుతూ నాడు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలు లూటీ చేయబడ్డారని, నేడు ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబం సంక్షేమం పొందుతోందన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో నాడు గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని జగనన్న ప్రజల దరిచేర్చారని చెప్పారు. జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి లక్షలాది మందికి లబ్ధి చేకూర్చారని తెలిపారు. ప్రతి కుటుంబం జగనన్నకు అండగా ఉండి మరోసారి గెలిపించుకోవాలని సూచించారు.